సాక్షి
నంద్యాల
శనివారం ౹ 26 ౹ జూలై ౹ 2025



రక్షణ చట్టం తేవాలి

న్యాయవాదులపై దాడులు జరగకుండా రక్షణ చట్టం తేవాలని ఐఎల్‌ఏ డిమాండ్ చేసింది. కర్నూలులో గురువారం న్యాయవాదులు నిరసన తెలిపారు. 8లో▸



208 రైతు సేవా కేంద్రాలు మూత

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 208 రైతు సేవా కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో వీటి సంఖ్య 877 నుంచి 669కి పడిపోయింది. రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.48
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.073
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:26,478
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:28,246

న్యూస్‌రీల్

రెండో రోజు కేంద్ర బృందం తనిఖీలు



రైతుతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

జూపాడుబంగ్లా: కేంద్ర ప్రభుత్వ నిధులతో మండలంలో చేపట్టిన ఉపాధి పనులను రెండు రోజు శుక్రవారం కేంద్రబృందం సభ్యులు పరిశీలించారు. జూపాడుబంగ్లా గ్రామ సచివాలయం -2లో గ్రామసభ నిర్వహించారు. ఉపాధికూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన రికార్డులు చూపించాలని పీఎస్‌లు తిప్పన్న, ఫాతిమాబీలను కేంద్రబృందం టీం లీడర్ సంతోష్‌కుమార్ అడగటంతో వారు బిక్క మొహం వేశారు. 2025-26 ఏడాదికి గాను 196 పనులకు సంబంధించి పనుల వద్ద నేమ్‌బోర్డులు ఎందుకు ఏర్పాటు చేయలేదని ఉపాధి సిబ్బందిని నిలదీశారు. రూ.1,84,292లతో రుక్మాంగధరుడు అనే రైతు పొలంలో సాగుచేసిన మల్లెచెట్లను వారు పరిశీలించారు. పి.లింగాపురంలో సైతం ఉపాధిపనులు, గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవటంతో వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి వెంట ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీడీ అన్వరాబేగం, ఏఈ లు బషీర్, నాగేంద్ర, జ్యోతి, లైజనింగ్ అధికారి దాసు, ఏపీఓలు రేష్మ, గౌరీబాయి తదితరులు ఉన్నారు.

చౌడేశ్వరిదేవికి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కుందూకు వరద ఉద్ధృతి



క్రిష్టిపాడు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న కుందూ

దొర్నిపాడు: కుందూనదికి వరద ఉద్ధృతి పెరిగింది. దీంతో క్రిష్టిపాడు గ్రామం వద్ద కుందూనదిపై నిర్మించిన వంతెన నీట మునిగింది. నీటి మట్టం పెరుగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన రైతులు పొలాలు చాలా వరకు కుందూనది ఒడ్డునే ఉన్నాయి. ప్రస్తుతం వరినాట్లు వేసే పనుల్లో ఉన్నారు. వంతెనపై రాకపోకలకు నిలిచిపోతే కోవెలకుంట్ల, గుళ్లదూర్తి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాలను తిరిగి రావాలంటే 20 కి.మీ ప్రయాణించాలి. వంతెనపై వెళ్లే సమ యంలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు.

చిరుజల్లులకే పరిమితం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు నిరాశాజనకంగానే కురుస్తున్నాయి. వారం రోజులుగా ఆకాశం మేఘావృతమైనప్పటికీ చిరుజల్లులే కురుస్తున్నాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా ఇప్పటి వరకు 75.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు 11 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. రానున్న ఐదు రోజుల్లో కూడా చిరుజల్లులే కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. రానున్న ఐదు రోజుల్లో గాలుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

28న కౌలు రైతు సమస్యలపై ధర్నాలు

కర్నూలు(సెంట్రల్): కౌలు రైతులపై కూటమి సర్కార్ తీరుకు నిరసనగా ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కౌలు రైతులకు గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కారణంగా బ్యాంకుల్లో పంటరుణాలు మంజూరు చేయడం లేదన్నారు. కౌలు రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పట్టు తప్పిన రాయితీలు!



సాగు చేసిన మల్బరీ

- రైతులకు సబ్సిడీలు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- షెడ్ నిర్మిస్తే అందని రూ.1,12,500
- కిలో పట్టుగూళ్ల ఉత్పత్తికి రూ.50 ఇంటెన్సివ్‌కు ఎగనామం
- 2024-25లో ఉమ్మడి జిల్లాలో 200 ఎకరాల్లో ప్లాంటేషన్
- ఈ ఏడాది ఇప్పటి వరకు 22 ఎకరాల్లోనే సాగు!

కర్నూలు(అగ్రికల్చర్): అగ్గిపెట్టెలో పట్టే విధంగా పట్టు చీరలు నేసిన ప్రాంతం ఉమ్మడి కర్నూలు జిల్లా. అయితే పట్టు పరిశ్రమకు, మల్బరీ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం లేదు. పెట్టుబడి వ్యయం రెట్టింపు అవుతున్నా రైతులకు సబ్సిడీలు అందడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పట్టుగూళ్ల మార్కెటింగ్ సదుపాయం లేదు. నష్టాలు ఎక్కువగా ఉండటంతో రైతులు మల్బరీ సాగుకు దూరమవుతున్నారు. గతేడాది (2024-25లో) మల్బరీ సాగు తగ్గిపోగా.. ఈ ఏడాది మరింత అధ్వాన స్థితికి చేరింది.

అరకొరగా మల్బరీ సాగు

2025-26లో కర్నూలు జిల్లాలో 150, నంద్యాల జిల్లాలో 200 ప్రకారం ఉమ్మడి జిల్లాలో 350 ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టాలనేది లక్ష్యం. ఖరీఫ్ సీజన్ మొదలై దాదాపు 50 రోజులవుతున్నా మల్బరీ సాగులో పురోగతి కనిపించడం లేదు. కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 18 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 4 ఎకరాల్లో మాత్రమే మల్బరీ ప్లాంటేషన్ జరిగినట్లు తెలుస్తోంది. 2024-25లో ఉమ్మడి జిల్లాలో 350 ఎకరాల్లో మల్బరీ ప్లాంటేషన్ చేపట్టాలనేది లక్ష్యం. అయితే 200 ఎకరాల్లో మాత్రమే జరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి మరింత తగ్గే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికీ మల్బరీ సాగుపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించడానికి చర్యలు తీసుకోలేదు. రాయితీలు తగ్గించడంతో రైతులు పట్టు సాగుపై నిర్లిప్తతతో ఉన్నట్లు తెలుస్తోంది.

'ఉపాధి' తొలగింపు

మల్బరీ సాగు చేసే రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేక రాయితీలు లభించేవి. షెడ్ల నిర్మాణానికి 'ఉపాధి' నిధుల నుంచి సబ్సిడీలు ఆశాజనకంగా ఉండేవి. ఒక షెడ్‌కు రూ.3.50 లక్షల వరకు సబ్సిడీ ఇచ్చేవారు. 2024-25 నుంచి షెడ్ల నిర్మాణానికి 'ఉపాధి' నుంచి రాయితీలు లేవు. కేవలం ప్లాంటేషన్‌లో మాత్రం అరకొర సబ్సిడీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది ఒక్క రైతుకు కూడా 'ఉపాధి' నుంచి ప్లాంటేషన్‌కు రాయితీలు ఇవ్వలేదు.

ప్రోత్సాహం కరువై!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతంలో 1,500 టన్నుల బైవోల్టెన్ పట్టుగూళ్ల ఉత్పత్తి జరిగేది. 2024-25లో కేవలం 500 టన్నులకు పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో ఉత్పత్తి చేసిన పట్టుగూళ్లను హిందూపురం మార్కెట్‌కు తరలించాల్సి వస్తోంది. మార్కెట్‌లో పట్టుగూళ్లకు లభించిన ధరకు అదనంగా కిలోకు రూ.50 రాష్ట్ర ప్రభుత్వం ఇంటెన్సివ్ పేరుతో ప్రత్యేక ప్రోత్సాహం ఇచ్చేది. కూటమి ప్రభుత్వం ఇంటెన్సివ్ ఇవ్వడం లేదు.

సబ్సిడీలకు తిలోదకాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023-24 వరకు మల్బరీ సాగును ప్రోత్సహించాయి. కేంద్ర ప్రభుత్వం యథాతథంగా రాయితీలు ఇస్తుండగా 2024-25 నుంచి కూటమి ప్రభుత్వం సబ్సిడీలకు తిలోదకాలు ఇచ్చింది.
- పట్టుపురుగుల పెంపకం కోసం రైతులు విధిగా షెడ్డు నిర్మించుకోవాల్సి ఉంది. షెడ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2.25 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,12,500 సబ్సిడీ ఇస్తాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా కింద రూ.1,12,500 సబ్సిడీ ఇవ్వడం లేదు. దీన్ని కూడా రైతు భరించాల్సి వస్తోంది.
- మల్బరీ మొక్కలు నాటుకోవడంలో (ప్లాంటేషన్) ఎకరాకు యూనిట్ కాస్ట్ రూ.30 వేలు ఉంది. ఇందులో కేంద్రం ప్రభుత్వం రూ.15,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 ఇవ్వాల్సి ఉంది. రైతు రూ.7,500 భరించాల్సి ఉంది. అయితే మొక్కలు నాటుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం లేదు.
- పరికరాలకు యూనిట్ కాస్ట్ రూ.75 వేలు ఉండగా..రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా రాయితీలకు ఎగనామం పెట్టింది.
- మల్బరీ సాగు చేసే రైతులకు బ్రష్ కట్టర్, పవర్ స్ప్రేయర్లు, సికేచర్ వంటివి కూడా రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. అయితే వీటిని కూడా ఇవ్వడం లేదు.



పట్టు పురుగుల పెంపకం

నష్టపోయాం



నేను 3 ఎకరాల్లో మల్బరీ సాగు చేశాను. 150 గుడ్లకు రికార్డు స్థాయిలో బైవోల్టెన్‌లో 140 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి చేశాను. ఇటీవల హిందూపురం మార్కెట్‌లో కిలో రూ.550 ప్రకారం విక్రయించాను. గతంలో కిలోకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 ఇంటెన్సివ్ ఇచ్చేది. ఈ రాయితీ లేకపోవడంతో రూ.7,000 నష్టపోయాం. పట్టు సాగులో పెట్టుబడి వ్యయం ఎక్కువగా ఉంది. రాయితీలను పెంచాలి. – పి.నన్నేసాహెబ్, నరసాపురం, వెల్దుర్తి మండలం

చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో మల్బరీ సాగుకు ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది జిల్లాలో 150 ఎకరాల్లో మల్బరీ ప్లాంటేషన్ చేయాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 18 ఎకరాల్లో చేపట్టాం. ఇంకా సమయం ఉంది. కనీసం 100 ఎకరాల వరకు ప్లాంటేషన్ చేపడుతాం. రైతులను గుర్తిస్తున్నాం.

– ఆంజనేయులు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి, కర్నూలు

గంజాయి ముఠా అరెస్ట్

- 2.5 కేజీల గంజాయి స్వాధీనం
- నలుగురు అరెస్ట్.. ఐదుగురు పరారీ

నంద్యాల: గుట్టుగా గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక వైపు గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశారు. ఈ దాడిలో పట్టణానికి చెందిన వెంకటచిరు, షాహినూర్‌బాషా, దుర్గాప్రసాద్, మరో 17 సంవత్సరాల బా లుడు పట్టుబడ్డారు. మరో ఐదుగురు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని గ్రామాల్లో చిన్నచి న్న ప్యాకెట్లుగా తయారీ చేసి విక్రయిస్తుండగా పట్టుకున్నామని సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి ముఠాపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

పరారయ్యారా.. తప్పించారా..?

పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడటం నంద్యాల పట్టణంలో కలకలం రేపింది. మున్సిపల్ కార్యాలయం వెనుక 2.5 కేజీల గంజాయి పట్టుబడిన సంఘటనలో 9 మంది పట్టుబడినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే వీరిలో నలుగురు నిందితులను మాత్రమే పోలీసులు అరెస్ట్ చూపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టణానికి చెందిన వారిని మాత్రమే ఈ కేసులో అరెస్ట్ చూపించారని, విక్రయించడానికి వచ్చిన బయటి వ్యక్తులను వదిలేసినట్లు సమాచారం. వదిలేసిన వ్యక్తుల నుంచి భారీగా డబ్బులు చేతులు మారినట్లు చర్చ జరుగుతోంది. ఈ ముఠా విశాఖపట్నం, అరకు ప్రాంతం నుంచి గుట్టుగా గంజాయి నంద్యాలకు తెచ్చి వ్యాపారం చేస్తుందని తెలుస్తోంది.

కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

కర్నూలు (హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వం బీడీ, సున్నపు రాయి, డోలమైట్ గని కార్మికుల పిల్లలు, విద్యార్థులకు 2025-26 సంవత్సరానికి గాను ఉపకార వేతనాలు అందజేస్తోందని బీడీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాల కోసం కార్మికుల పిల్లలు ఆన్‌లైన్‌లో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (scholarships. gov.in)లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వంతో గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు దీనికి అర్హులన్నారు. 10 వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థులు ఆగస్టు 31 లోగా, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 0120-6619540, 040-29561297, స్థానిక బీక్యాంప్‌లోని బీడీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ డిస్పెన్సరీలో సంప్రదించి సమాచారం తెలుసుకోవాలన్నారు.

చెంచులకు మెరుగైన వైద్యసేవలు

- జిల్లా వైద్యాధికారి వెంకటరమణ



శివపురం చెంచు గూడెం గిరిజనులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

కొత్తపల్లి/ఆత్మకూరు: గిరిజన గూడేల్లోని చెంచులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ సూచించారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలో కొత్తపల్లి, శివపురం, ఆత్మకూరు మండలంలోని బైర్లూటీ పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. శివపురం చెంచుగూడెంలో 104 సంచార చికిత్సను సందర్శించి, ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా చెంచు మహిళలతో వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. బైర్లూటీ పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది సమయపాలన పాటించడం లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏబీహెచ్‌ఏ ఐడీ జనరేషన్, పీఎంజేఏవై పథకాల లబ్ధిదారులకు అన్నీ వైద్యసేవలు అందించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు దీపా నాగవేణి, మహమ్మద్ బేగ్, జబ్బీర్, విజయేంద్ర, జుబేదా, వైద్య సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యానికి మూత'బడి'



మూసివేసిన టీ.కొట్టాల పాఠశాల



తలుపులు తెరుచుకోని పందిర్లపల్లె స్కూల్

- టీ.కొట్టాల, పందిర్లపల్లె పాఠశాలలకు తాళాలు
- మరో మూడు పాఠశాలల్లో పది లోపు విద్యార్థులు



తలుపులకు తాళం వేసిన దృశ్యం

రుద్రవరం: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుండటంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. పాఠశాలల పునఃప్రారంభంలో అడ్మిషన్లపై చొరవ చూపకపోవడం, ఖాళీగా ఉన్న స్థానాలకు ఉపాధ్యాయులను నియమించకపోవడం, ఏకోపాధ్యాయ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో సర్కారు బడులు మూతబడుతున్నాయి. రుద్రవరం మండలంలో ఇప్పటికే రెండు పాఠశాలలకు తాళం వేయగా, మరి కొన్ని మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ ఏడాది కొత్తగా 1వ తరగతికి విద్యార్థులు చేరక పోవడం, ఆపై తరగతిలో ఉన్న ఒకరు ఇద్దరు బయటి పాఠశాలల్లో చేరడంతో డీ.కొట్టాల పంచాయతీ మజరా గ్రామమైన టీ.కొట్టాల, మరొకటి పెద్దకంబలూరు పంచాయతీ మజరా పందిర్లపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు రెండు మూత పడ్డాయి. పాఠశాలల్లో సరైన వసతులు లేక పోవడం, కూటమి ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించలేకపోవడంతో పాఠశాలలు మూత పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలు కళకలాడాయి. కూటమి ప్రభుత్వం పాఠశాలను నిర్లక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. రుద్రవరం మండలంలో మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాక కొన్ని పాఠశాలల్లో 1వ తరగతికి విద్యార్థుల నమోదు సంఖ్య అరకొరగా ఉంది. మరికొన్ని పాఠశాలల్లో ప్రవేశాలు లేవు. అలాగే కొన్ని పాఠశాలల్లో 2, 3, 4, 5 తరగతులకు సంబంధించి విద్యార్థులు అరకొరగా ఉండటంతో ఉపాధ్యాయులు పట్టించుకోరని భావించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గి ఇప్పటికి రెండు మూత పడ్డాయి. ఆర్.కొత్తపల్లెలో 10 మంది, ఎల్లావత్తుల స్పెషల్‌లో ఏడుగురు, చిన్నకంబలూరు స్పెషల్లో ఆరుగురు చొప్పున మాత్రమే విద్యార్థులు ఉన్నారు. ఇలా విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గి పోతు బడులు మూసివేతకు గురవుతున్నాయి.

ఈరన్న స్వామి.. నమోనమామి!

- ఉరుకుందలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. తెల్లవారు జామున 4 గంటలకు సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. రాత్రి 8 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేశారు. గోవు పూజ అనంతరం ఆలయ గోపురంపై స్వామి జెండాను ఆవిష్కరించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈరన్న స్వామి.. నమోనమామి.. అని వేడుకున్నారు. శ్రావణ మాస ఉత్సవాలు ఆగస్టు 23 వరకు కొనసాగుతాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు.



దెబ్బతిన్న బూజునూరు - గడివేముల రహదారి

నెలకే 'తారు'మారు

- నాసిరకంగా బూజునూరు-గడివేముల రోడ్డు

రోడ్లు వేశాం.. గుంతలు పూడ్చామని గొప్పలు చెప్పుకునే పాలకులు ఒక సారి ఆ దారుల్లో ప్రయాణించాలని ప్రజలు వాపోతున్నారు. కొత్తగా నిర్మించిన రహదారి నెలకే ఛిద్రమైతే ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. కమీషన్లకు నాణ్యత చెదిరిపోయి, మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయని చెప్పేందుకు బూజునూరు – గడివేముల రహదారే నిదర్శనం. బూజునూరు నుంచి గడివేముల మీదుగా మంచాలకట్ట వరకు రూ.కోట్లు ఖర్చు చేసి నూతన రోడ్డు నిర్మించారు. రోడ్డు పనులు పూర్తయ్యాయి. అయితే గడివేముల సొసైటీ సమీపంలో రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించి నిధులు కాజేశారనే ఆరోపణలున్నాయి. – గడివేముల

పేదల బతుకుల్లో వెలుగులు నింపుదాం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం సీఎం చంద్రబాబు అమరావతి సచివాలయం నుంచి పీ4పై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లాధికారులు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పేదరిక నిర్మూలనకు సంపన్నులందరూ ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అత్యుత్తమ విధానాలను జిల్లా అంతట అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో కార్పొరేట్ సంస్థలు కూడా కలిసి వచ్చేలా చూడాలన్నారు. అధికారులు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికి చెందిన ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బంగారు కుటుంబాలు, మార్గదర్శుల వివరాలు సరిగ్గా నమోదు చేసినప్పుడే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లాలో బంగారు కుటుంబాలను 'మార్గదర్శులు' దత్తత తీసుకునే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): 2026-27 విద్యాసంవత్సరానికి బనవాసిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ విషయాన్ని ఎంఈఓలు తెలియజేయాలన్నారు. ఆగస్టు 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. జలాశయానికి వస్తున్న వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని దిగువ ప్రాజెక్ట్‌లకు నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం నుంచి శుక్రవారం వరకు జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి 1,10,853 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. అలాగే శ్రీశైలం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 1,56,726 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 1.60 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నాగార్జునసాగర్‌కు స్పిల్‌వే ద్వారా 54,455 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన ద్వారా 69,304 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 29,375 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,992 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 16.384 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.494 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. శుక్రవారం సాయంత్రానికి డ్యాం నీటిమట్టం 882.50 అడుగులుగా నమోదైంది. జలాశయంలో 202.0439 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



రెండు క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

క్లుప్తంగా

ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ కోసం 28న నిరసన

కర్నూలు(సెంట్రల్): విలువైన ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ కోసం ఈనెల 28న కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, జిల్లా కార్యదర్శి వీఎస్ రాయుడు తెలిపారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అధ్యక్షతన ఎస్‌డబ్ల్యూఎఫ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

గురుకులంలో అటకెక్కిన ఫిజిక్స్, తెలుగు బోధన

కర్నూలు(అర్బన్): జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫిజిక్స్, తెలుగు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. ఈ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 185 మంది విద్యార్థులు వసతితో పాటు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే పాఠశాలలు పునః ప్రారంభమై నెలన్నర రోజులు కావొస్తున్నా, నేటికి ఫిజిక్స్, తెలుగు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి. ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన జీ గౌరీదేవి ఇటీవల జరిగిన బదిలీల్లో నంద్యాల జిల్లా మహానందికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నేటికి ఎవరినీ నియమించలేదు. అలాగే తెలుగు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి జూన్ 14వ తేది నుంచి మెడికల్ లీవ్‌లో వెళ్లారు. దీంతో ఈ రెండు సబ్జెక్టులను బోధించే వారు లేరు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆయా సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆ చేయి ఎవరిది?


రైలు ట్రాక్‌పై పడి ఉన్న చేయి భాగం

డోన్ టౌన్: డోన్ రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫామ్ ట్రాక్‌పై శుక్రవారం ఉదయం తెగిపడిన ఎడమ చేయి భాగం కనిపించడం కలకలం సృష్టించింది. ప్రమాదవశాత్తూ గుర్తు తెలియని ప్రయాణికుడి చేయి తెగిపడితే రైల్వే అధికారులకు సమాచారం అందేది. ఈ విషయంపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవ్వరినైన హత్య చేసి అచూకీ లభించకుండ నిందితులు హతుడి శరీర భాగాలను రైలు మార్గంలో అక్కడక్కడ పడేస్తూ వెళ్లారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు స్టేషన్‌కు ఇరువైపులా గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి క్లూ లభించలేదు. రైల్వే పోలీసు ఎస్‌ఐ బింధుమాధవి మాట్లాడుతూ.. ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఎడమ చేయి భాగం లభ్యమైందని, ఇతర ఏ శరీరం భాగాలు కనపించలేదన్నారు. లభించిన చేయి భాగాన్ని కర్నూలు ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


మృతుడు వన్నయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాలనీకి చెందిన వెంకటేష్, శాంతమ్మ దంపతుల కుమారుడు వన్నయ్య(32) విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం మృతిచెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. వన్నయ్య బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పట్టణ శివారులోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఇల్లు నిర్మాణం జరుగుతోంది. అక్కడ వన్నయ్య పనిచేస్తూ పై అంతస్తుకు ఇసుకను తరలించేందుకు లిఫ్ట్‌ను స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. గుర్తించిన స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పురి విప్పిన నెమలి

'మయూర' నాట్యం

నల్లమల అడవుల నుంచి వచ్చిన నెమళ్లు శుక్రవారం కర్నూలు జొహరాపురంలోని క్రికెట్ స్టేడియంలో సందడి చేశాయి. అటూ ఇటూ తిరుగుతూ పురి విప్పి నాట్యమాడుతూ కనువిందు చేశాయి. జాతీయ పక్షులను చూసేందుకు చాలా మంది ఆసక్తి చూపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


సందడి చేస్తున్న మయూరాలు

208 రైతు సేవా కేంద్రాల మూత

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 208 రైతు సేవా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం మూసివేసింది. నంద్యాల జిల్లాలో 411 ఉండగా రేషనలైజేషన్ కారణంగా 294కు తగ్గిపోయాయి. మొత్తం 117 రైతు సేవా కేంద్రాలు మూతపడ్డాయి. కర్నూలు జిల్లాలో 466 ఉండగా రేషనలైజేషన్ ప్రక్రియతో 71 మూతపడి 395 మిగిలాయి. అస్తవ్యస్త బదిలీల కారణంగా వీఏఏలు లేక మరో 20కిపైగా మూతపడిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం రైతు సేవా కేంద్రాల 877 నుంచి 669కి తగ్గిపోయాయి. నంద్యాల జిల్లాలో ఎక్కువగా ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను (వీఏఏలను) కర్నూలు జిల్లాలోని ఆదోని, పెద్దకడుబూరు, కోసిగి, ఆలూరు, చిప్పగిరి వంటి మండలాలకు బదిలీ చేశారు. బదిలీల్లో సీనియారిటీని పట్టించుకోకపోవడం, స్పౌజ్ ఇతర ప్రత్యేక కేటగిరీలను నిర్లక్ష్యం చేయడం, టీడీపీ నాయకుల సిఫార్సు లేఖలకు, ముడుపులకు పెద్దపీట వేయడం తదితర కారణాలతో పలువురు వీఏఏలు హైకోర్టును ఆశ్రయించారు. యథాస్థితిని కొనసాగించాలని హైకోర్టు నుంచి ఆదేశాలు జారీ రావడంతో వీఏఏలు అంతకు ముందు పనిచేస్తున్న రైతు సేవా కేంద్రాల్లోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడం, ఎరువులు, విత్తనాల అవసరం రావడం, రైతు సేవా కేంద్రాలు మూతపడి ఉండటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలి

- ఐఎల్ఎల్ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎల్ఏ న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): న్యాయవాదులపై దాడులు జరగకుండా రక్షణ చట్టం తేవాలని ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ) డిమాండ్ చేసింది. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బార్ అసోసియేషన్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బార్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ పి.రవిగువేరా, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ఐఎల్ఏ జిల్లా నాయకులు బి.చంద్రుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సుబ్బయ్య, ఓంకార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్‌ను రూ.6లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటు రూ.4 లక్షలు ఉండాలన్నారు. న్యాయవాదులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచాలన్నారు.అంతేకాక న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్‌ప్రసాదు, కోశాధికారి పి.దస్తగిరి, జిల్లా ఉపాధ్యక్షులు షఫీ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు మండలం వెంకాయపల్లె గ్రామ పొలిమేర్లలో కేసీ కెనాల్ గట్టు కింద వేప చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం స్థానికులు గుర్తించి గ్రామ తలారి వెంకటేశ్వర్లుకు సమాచారమివ్వగా ఆయన వీఆర్వో ఖాజా దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా ఎస్‌ఐ పీరయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9121101063కి ఫోన్ చేసి సమాచారమివ్వాలని కోరారు.

భాగవతం అమృత భాండం


నందీశ్వరాలయంలో ధర్మప్రచార కార్యక్రమంలో విశ్వమాతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: భాగవతం మనిషికి అమృతతత్వాన్ని ప్రసాదించే అమృత భాండమని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకట రెడ్డి అన్నారు. నందికుంట గ్రామంలోని పురాతన నందీశ్వరాలయంలో శుక్రవారం ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్వమాత సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగవతాన్ని ప్రతి ఒక్కరూ అవ పోషణ పడితే మంచి ప్రవర్తన, సద్గుణాలు, మానవత్వం అలవడుతుందన్నారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు చేపట్టారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజదాసు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పురోహితులు లక్ష్మీనారాయణ చారి, గ్రామ సర్పంచ్ హైరెడ్డి నిత్యలక్ష్మి, నారాయణరెడ్డి, గ్రామ పెద్దలు టి.మధుసూదన రెడ్డి, స్థానిక భజన బృందం సభ్యులు నారాయణ, శివన్న, పుల్లయ్య, దత్తు శివన్న, మహేష్, ప్రవీణ్, హేమంత్ సాయి, బాణ రామిరెడ్డితో పాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

మహిళ బలవన్మరణం

పెద్దకడబూరు/మంత్రాలయం రూరల్: ఒంటరితనం భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శివాంజల్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మంత్రాలయం మండలం వగరూరు గ్రామానికి చెందిన కురువ పద్మావతి(36)కి పెద్దకడబూరు మండలం కంబలదిన్ని గ్రామానికి చెందిన కురువ నాగేంద్రతో కొన్ని సంవత్సరాల క్రితం పెళ్లి అయ్యింది. అయితే భర్త కురువ నాగేంద్ర 12ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమహిళ ఒంటిరిగా తన పుట్టినిల్లు అయిన వగరూరు గ్రామంలోనే నివాసం ఉండేది. ఏడు నెలల క్రితం పద్మావతికి పక్షవాతం వచ్చి కుడిచెయ్యి పని చేయకుండా అయ్యింది. దీంతో ఒంటరితనం భరించలేక, చెయ్యి కూడా పని చేయకపోవడంతో మానస్తాపం చెంది ఈనెల 23న ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. వగరూరు చెరువులో పడి చనిపోయినట్లు శుక్రవారం గ్రామస్తులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలియజేశారు. పద్మావతి అన్న కురువ మల్లేష్ ఫ్యిరాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ తెలిపారు.

మళ్లీ గ్రామాల్లో చిరుత పులి సంచారం


పొలాల్లో కనిపించిన చిరుత పాదముద్ర

గోనెగండ్ల: మండలంలోని ఎన్నెకండ్ల, గంజిహళ్లి గ్రామాల్లో చిరుత పులి గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున మళ్లీ సంచరించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయం..భయంగా ఉన్నారు. ఫారెస్టు సిబ్బంది రవి కుమార్, పశువైద్యులు నిర్మల దేవి శుక్రవారం ఆయా గ్రామాల్లో తిరిగారు. పొలాల్లో చిరుత పాదముద్రలను పరిశీలించారు. దున్నపోతు కళేబరం దగ్గరకు వచ్చి చిరుత పులి మాంసంను తిన్నట్లు గుర్తించారు. కారుమంచి కొండల్లో నుంచి చిరుత పులి వచ్చి ఉంటుందని, మళ్లీ అక్కడికే వెళ్లి ఉంటుందని ఫారెస్టు సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై సుగాలిమెట్ట గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన బత్తిన ఐసాక్ నర్సయ్య(59) హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇటీవల మానుకున్నారు. అతడి భార్య శ్యామలాదేవి పాణ్యం సమీపంలోని శాంతిరామ్ ఆసుపత్రిలో ఫిజియాలజిస్ట్ డాక్టర్‌గా పని చేస్తున్నారు. స్థానిక క్వాటర్స్‌లోనే ఇద్దరూ ఉంటున్నారు. పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన ఐసాక్ నర్సయ్య కారులో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పిన్నాపురం క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళ్తున్న లారీ ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా అకస్మాత్తుగా ఎడమ వైపు నుంచి కుడివైపు రావడంతో కారు ప్రమాదవశాత్తూ లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న బత్తిన ఐజాక్ నర్సయ్య తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ పోలీసులు సంఘటన స్థలానికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పనుల్లేక.. చెట్టు కింద ఆట!



చేద్దామంటే గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు లేవు.. మోస్తరుగా వర్షాలు కురుస్తుండటంతో సేద్యాలు సాగడం లేదు.. పొలాల్లో కలుపు తీయడానికి, విత్తనం వేయడానికి ఎవరూ పిలవడం లేదు. దీంతో తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలో శుక్రవారం రైతులు, వ్యవసాయ కూలీలు ఓ చెట్టు కింద చేరి 'పులి–మేక' ఆటతో కాలక్షేపం చేస్తూ కనిపించారు. పులి నుంచి మేకలను ఎలా కాపాడాలో.. పులిని ఎలా బంధించాలో చాలా తెలివిగా ఆట ఆడారు. బాలులు, యువకులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారని, వారు ఇలాంటి ఆటలు ఆడి జ్ఞానాన్ని పొందవచ్చని గ్రామ పెద్దలు తెలిపారు. పాలన సరిగ్గా లేని సమయంలో పాలకుల ఆట ఎలా కట్టించవచ్చో కూడా ఆలోచనలు వస్తాయని చెప్పారు. – తుగ్గలి

పిల్లల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్


జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

కర్నూలు: పిల్లల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ కార్యక్రమంలో భాగంగా కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఎస్పీ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు న్యాయపరమైన హక్కులు చాలా ముఖ్యమన్నారు. బాల కార్మికులను, బాల్య వివాహాలను, పిల్లల అక్రమ రవాణాను, బాల భిక్షాటన వంటి వాటిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తరహా ఘటనలు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112, 100 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు. పిల్లల అక్రమ రవాణాలో పాల్గొనేవారికి కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. బాలుర సంక్షేమ సమితి సభ్యుడు మధు సుధాకర్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జిల్లా కోఆర్డినేటర్ మౌనిక, ఏరియా కోఆర్డినేటర్ మునుస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సుంకన్న తదితరులు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

శ్రీమఠానికి నీటిశుద్ధి ప్లాంట్ విరాళం


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నీటి శుద్ధి ప్లాంట్‌ను లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ అందజేశారు. శుక్రవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు చేతుల మీదుగా పూజలు చేసి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ ప్లాంట్‌కు రాఘవేంద్ర జల ప్రసాద అనే పేరు పెట్టారు. ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్ కుమార్‌ను అంక్షితలు వేసి శ్రీమఠం పీఠాధిపతి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం అధికారులు, ఎల్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

జంట ఆత్మహత్యాయత్నం

- కదులుతున్న రైలు నుంచి దూకి వివాహిత మృతి
- రైల్వే ట్రాక్‌పై పడుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం


యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (చిత్రంలో) ట్రాక్‌పై కూర్చున్న యువకుడు మహేష్

గార్లదిన్నె: ఉపాధి అవకాశాలు దక్కకపోవడంతో ఓ జంట ఆత్మహత్యాయత్నం చేసింది. కదులుతున్న రైలు నుంచి దూకి వివాహిత మృతి చెందగా.. రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని స్థానికుల సాయంతో పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా అయ్యలూరుకు చెందిన మహేష్ బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ అప్పటికే వివాహమై భర్త మృతిచెంది ఒంటరిగా జీవిస్తున్న దీపిక పరిచయమైంది. ఇద్దరూ కలసి సహజీనం సాగించేవారు. ఈ క్రమంలో పని కోసం వారం రోజుల క్రితం ఇద్దరూ గుంటూరుకు వెళ్లారు. అక్కడ పని దొరక్కపోవడంతో గుంతకల్లు మీదుగా గురువారం అనంతపురానికి చేరుకున్నారు. అక్కడ కూడా పని దొరక్కపోవడంతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమై అదే రోజు రాత్రి కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మార్గమధ్యంలో దీపిక కదులుతున్న రైలు నుంచి కిందకు దూకేసింది. పక్క స్టేషన్‌లో రైలు ఆగగానే కిందకు దిగిన మహేష్ రోడ్డు మార్గంలో గార్లదిన్నె మండలం ఎగువపల్లి సమీపంలోకి శుక్రవారం తెల్లవారుజామున చేరుకున్నాడు. జాతీయ రహదారి పక్కన వాకింగ్ చేస్తున్న స్థానికులను కలసి రైల్వే స్టేషన్‌కు మార్గాన్ని అడిగి, అటుగా కాకుండా నేరుగా రైల్వే ట్రాక్‌పై చేరుకుని పట్టాలపై అడ్డంగా పడుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా, సిబ్బంది అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. తన భార్య రైలు నుంచి దూకిందని, తాను కూడా ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడినట్లు వివరించాడు. దీంతో విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు గార్లదిన్నె – కల్లూరు మధ్య ట్రాక్‌పై పరిశీలన చేపట్టారు. కల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో రామ్‌దాస్‌పేట వద్ద పట్టాలపై యువతి మృతదేహాన్ని గుర్తించారు. మృతురాలిని దీపికగా మహేష్ నిర్ధారించాడు. ఘటనపై రైల్వే ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, యువతి మృతిపై అనుమానాలు ఉన్నట్లుగా పోలీసులు పేర్కొనడం గమనార్హం.

అప్పుల భారంతో వ్యక్తి ఆత్మహత్య

నందికొట్కూరు: పట్టణంలోని కుర్వపేటకు చెందిన శేఖర్(39) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శేఖర్ ఐదు ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి తదితర పంటలు సాగు చేసి నష్టపోయాడు. సాగుకు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో గురువారం రాత్రి ఇంట్లోనే శరీరంపై టర్పంటాయిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.